'వర్రినోడిని సదివించాల' అంది వరాలు.
"ఓసోసి! మనకేటుందని సదివిత్తాం" అన్నాడు సిమ్మాద్రి.

"సదివించడానికి డబ్బెందుకయ్యా! ఊరికినే సదువుకోవచ్చుట. మనలాటి బీదోళ్ళకి అన్ని సదుపాయా లున్నాయట."

"ఏటో అంటవేగాని- మనకేటెరుక? ఆడకెల్లినాక ఎటుదెటొచ్చినా- మనకాడ ఈడిత్తంతే ఏగాని నేదు. మనలాటోళ్ళ కెందుకే సదువు?"

"నువ్వేటయ్యా అలా గంటావు- కన్న కొడుకుని ఆ మాతరం సదివించనేవేటి? నాలుగచ్చరం ముక్కలు నోటల వుంటే- ఆ డెలాగయినా బతికేయగల్డు. నేకపోతే నీ లాగ రిచ్చానాగాల."

"సదువుకు నోళ్ళకి రిచ్చాకూడా యియ్యటం నేదంట. మా శాత్రుల్లుగోరు సెప్పారు. అందుసేత మనోడిని సదివించకండా రిచ్చాయే లాగనిత్తావో, సదువు సెప్పించి ఆ రిచ్చాకూడా నేకుండా సేత్తావో మరి నువ్వే సెప్పు."

"అయ్యన్నీ పాతరోజులయ్యా - మా బాపనమ్మ సెప్పినాది. సరకారు బీదోళ్ళ కోసం ఏటేటో ఎన్నో పనులు సేత్తందంట. బూవులు పంచి పెడతందంట. ఇళ్ళు కట్టిత్తందంట. ఏటో ఎనకటికి దేవుడు సూడాల, అదుట్టం బావుండాల అనుకుండేవోళ్ళంగాని.... యిప్పుడంతా ఆయమ్మేయనుకో. ఆయమ్మకి దణ్ణం పెట్టాల. మారాజు తల్లి- మనలాటోళ్ళని సూసేందుకు- ఆ దేవుడే పంపించాడా యమ్మని."

"అవున్లే మా శాత్తుర్లుగోరు కూడా అదే అన్నారు. మన 'అదుట్టం' బావుండి మనకీ ఒక ఇల్లు ఎకరం సెక్కా యిత్తే మన కడుపుమంట తీరిసట్టే."

"ఆయమ్మ తప్పకుండా ఆపని సేత్తది. మరి అందుసేత మన కొండడిని కొన్నాళ్ళు కట్టమయినా పడి సదివించుకోవాల"

"అలాగేలేయే" అన్నాడు సిమ్మాద్రి.

సిమ్మాద్రికి, వరాలుకి పెళ్ళయి ఏడేళ్ళయింది. అప్పుడు వాళ్ళది శ్రీకాకుళం జిల్లాలో ఒక మారుమూల కుగ్రామం. ఏదో పనిపాటలు చేసుకుంటూ బ్రతికే కుటుంబాలు వాళ్ళవి. సిమ్మాద్రికి పాతికేళ్ళు లోపే వుంటాయి. కాని ముప్పయి ఏళ్ళు దాటిన వాడిలా కనిపిస్తాడు. వరాలు కూడా అంతే. ఇరవై లోపే వున్నా'- ముదురుగా కనిపిస్తుంది. పెళ్ళయి సంవత్సరం తిరక్కుండానే కొడుకు పుట్టాడు. ఆ కొడుకును చూసి వాళ్ళు మురిసిపోయారు. 'ముత్యం లాగున్నాడు. మనలాటోళ్ళ యిళ్ళల్ల పుట్టవలసినోడుకాదు. పెద పెద్ద కళ్ళు. పొడుగుచేతులు....' అనుకుంటూ ఆ కొడుకును ఎత్తుకు ముద్దాడారు.

కాని దరిద్రానికి వాళ్ళమీద దయలేదు. అది రోజు రోజుకు వాళ్ళను కొరుక్కుతింటోంది. పనిపాటలు లేక అల్లల్లాడిపోయారు. బిడ్డకి కాస్త పాలచుక్కలు పోసుకునే దిక్కులేదు. తాము ఉపవాసాలు చేస్తున్నా, చంటి బిడ్డను చంపుకోలేకపోయారు. అందుకే ఆ బిడ్డను తీసికొని పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చి పడ్డారు. యిక్కడ రిక్షా అయినా లాగి బిడ్డని బ్రతికించుకోవచ్చునుకున్నారు.

ఇక్కడ సిమ్మాద్రికి చాలాకాలం రిక్షా దొరకలేదు. కొన్నాళ్ళు పుల్లలుకొట్టి కుటుంబాన్ని నడిపాడు. మరికొన్నాళ్ళు 'బంటా' లో పనిచేసి బస్తాలు మోశాడు. చివరికెలాగో రిక్షా సంపాదించి రాత్రి, పగలు కష్టపడుతున్నాడు. అయితే అప్పుడప్పుడు ఒంట్లో నలతగా వుండి రిక్షా వేయలేకపోతే ఇంట్లో పిల్లాడితో సహా ముగ్గురూ పస్తే. అందుకే ఆ పస్తులుచూడలేక పిల్లాడ్ని ఆకలితో మాడ్చలేక వరాలు ప్రక్క వీధిలోవున్న బాపనమ్మ యింటికెళ్ళి వడ్లు దంచి, బియ్యం చెరిగి, అంట్లు తోమి నాలుగు మెతుకులు తెచ్చి పిల్లాడికి పెట్టుకొనేది. తాము పడుతున్న కష్టాలు తమబిడ్డ పడకూడదని వాడిని చదివించి నాలుగక్షరం ముక్కలు నేర్పించాలని వరాలు ఆశపడింది. అందుకే సిమ్మాద్రితో- వాడిని చదివించాలని పదేపదే చెప్పి ఒప్పించింది.

"ఏరా కొండా! బళ్ళోకెల్లి సదువుకుంటావేట్రా" అన్నాడు సిమ్మాద్రి.

"ఎల్తాను" అన్నాడు కొండడు.

"మనోడు ఎల్తాడటేయ్" సిమ్మాద్రి.

"మరేటి - మనోడి నచ్చత్రం మంచిదయ్యా. ఆడిని మనం సదివించాలేగాని - ఆ 'సదువులమ్మ' ఆడి సేతిలోనే వుంది."

రెండు మూడు రోజుల్లో వాడికొక పలక కొన్నాడు సిమ్మాద్రి. కొండడు బడికెళుతున్నాడు - వస్తున్నాడు. అయితే నాలుగో రోజునే వాడి చేతిలోని పలక జారి కిందపడి ముక్క ముక్కలయింది. అదిచూసి కొండడికి గుండె ఆగినంత పని అయింది. ఎక్కి ఎక్కి ఏడుస్తూ యింటికి వచ్చాడు. వాడి ఏడుపు పలక బద్దలయినందుకు గాదు వాడి "అయ్య" కొడతాడని.

"ఏట్రా కొండా! ఏటా ఏడుపు?" అడిగింది వరాలు.

వాడు ఎక్కి ఎక్కి ఏడుస్తూనే వున్నాడు.

"ఏటా ఏడుపంటే మాటాడవేటి? మీ యయ్యనాగ నువ్వూ' మొండిరకం. అసలేటయిందిరా?

వాడు భయం చూపులు చూస్తూ ఏడుస్తూనే వున్నాడు.

వరాలు ఉన్నపళంగా లేచెళ్ళి కొండడిని దబదబా బాదేసింది. దానితో రాబోయే మాటకూడా పోయింది వాడికి. ఆ దెబ్బలు విని ప్రక్కగదిలోంచి గంగమ్మ వచ్చింది.

"ఏటొరాలు- ఏల బొట్టుడిని అలా బాదతన్నావు."

"సూడు గంగమ్మత్తా! బళ్ళోకెల్లి ఏడుత్తూ వచ్చినాడు. ఏలా ఏడుపంటే పలకడు, వులకడు మూగదెయ్యంనాగ."

"ఆడికేటి తెల్సే వరాలు - ఆడి సేతల పలకనేదు- పలగ్గాని సిదగ్గొట్టేసినాడేమొ సూడు."

"ఏరా! పలకేది?.... అదా సంగతి. ఓరి నాయనో మీ అయ్యొచ్చి సంపేత్తాడు. ఏటయిపోనాదిరా పలక? చెప్పవేట్రా?"


కొండడికి నోటిలోంచి మాట రావటం లేదు.

"అయినాగాని ఆడికెందుకే సదువు. మనలాటోళ్ళం పలక కొనుక్కోగలమా? పలక పుల్ల కొనుక్కోగలమా? ఆ మాలచ్చింగోరి పిల్లలతోపాటు యాడిని కూడా పేడ పోగెయ్యటానికి తోలు. పిడకలు పేసుకుంటే పావల డబ్బు లొత్తాయి.


కొండడికి ఆ క్షణం పేడపోగెయ్యటమే మంచిదనిపించింద. ఒక్క పలక బద్దలయినందుకు ఎంత సంఘర్షణ! వాడు దాన్ని తట్టుకోలేకపోతున్నాడు. 'అయ్య' వచ్చి ఎన్ని దెబ్బలు కొడతాడోనని ఆ పసివాడి హృదయం తల్లడిల్లిపోతోంది.

వరాలు కొండడిని అలా బాదటానికి కారణం కొండడు పలక బద్దలు కొట్టటం మాత్రమేకాదు. ఆ పూట వంట చెయ్యలేదు. రాత్రి నాలుగు మెతుకులు కొడుక్కి

**తమ బిడ్డలు చదువుకుని బాగుపడాలని నిరుపేదవర్గం ప్రజలకు వున్నా "బీదోళ్ళ" పిల్లలకు చదువుసాగకపోడానికి సవాలక్ష అడ్డంకులు వస్తాయి. ఆకలి కడుపులకి చదువు కూడెట్టదుకదా!**




# బీదోళ్ళ సదువు



శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ భౌతిక కాయాన్ని పార్లమెంటు భవనం ఎదుట జుమ్మా మసీదులో ప్రభుత్వ లాంఛనాలతో సమాధి చేసినప్పుడు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ప్రెసిడెంట్ సమాధిపై పుష్పగుచ్ఛాన్ని సమర్పిస్తున్న దృశ్యం

పెట్టి యిద్దరు పస్తుపడుకున్నారు. పొద్దునే సిమాద్రి బండేసి కెళ్ళాడు. డబ్బులు తేవాలి, వంట చెయ్యాలి. అలాంటి దుస్థితిలో తన ఆకలిని, బాధని....కొండడిమీద చూపించింది వరాలు.

సిమాద్రి వచ్చాడు. "ఎవుడి మొకం సూశావోగాని బోణీ కానేదు" అంటూ చతికిలబడ్డాడు. ఎదురుగా బెదురు చూపులు చూస్తున్న కొండడిని "ఏటయింది" అడిగాడు. ఆ గొంతులోని ఆకలి రాగాల కాఠిన్యానికి వాడు బెదిరిపోయాడు. వాడేమీ మాట్లాడలేదు. చివరికి జరిగిన విషయం వరాలు చెప్పింది. అది సిమాద్రికి చురుక్కుమనిపించింది.

"కూడు లేనోళ్ళకి సదువెందుకు. మన కట్టం ముద్దకే సరిపోదు. ఈడికి పలకలేం కొంటాం. పందుల్లాటోళ్ళిద్దర్ని రెండు మైళ్ళు లాగితేనేగాని రూపాయి కళ్ళ సూడం. అలాటిది యీడు నాల్రోలుకొక పలక సిదగ్గొడితే మనం ఏడకొంటాం. సదువు నేదు గిదువు నేదు- యీడిని కాపీ ఒటేల్లో ఎడతాను. అక్కడీడు ఆ యిడ్డెను ముక్క, ఆ అట్టు ముక్క తిని బలవనన్నా బలుస్తాడు. మనకి నాలుగు డబ్బులూ వస్తాయి."

మూలనున్న కొండడికి వాళ్ళ అయ్య చెప్పింది బావున్నట్టనిపించింది. "అక్కడయితే ఏదో ఒకటి తినొచ్చు- ఆకలేయదు కాబోలు" అనుకున్నాడు. కాని వాళ్ళ "అమ్మ" అందుకు ఒప్పుకోలేదు.

"ఆడిని గదమాయించాను. యికాడు కమ్మగుంటాడులే. యియ్యాల ఆడు తెచ్చే నాలుగు డబ్బులు కోసం సూసుకుంటే - రేపాడి బతుకంతా సీకటయిపోద్ది. ఎలాగయినా ఆడిని సదివించాల."

ఆ మాటలేవిటో కొండడికి అర్థంకాలేదు. ఆ క్షణం వాళ్ళ 'అమ్మ' అంటే వాడికి కోపంకూడా వచ్చింది.

"సదివించు, సదివించు. కూడూ, నీళ్ళూ నేకండా ఆడినేటి సదివిత్తావో సదివించు" అనుకుంటూ మళ్ళీ బండి తీసుకు వెళ్ళిపోయాడు సిమాద్రి.

కొండడికి దెబ్బలు తప్పాయి. అప్పటి వరకు ఊపిరి బిగపట్టి నుంచున్న కొండడు కాస్త గాలి పీల్చుకున్నాడు.

* * *

రెండు పూటల ఉపవాసం తరువాత ఆ రాత్రి ముగ్గురు కడుపునిండా అన్నం తిన్నారు. ఆ రోజు తెల్లారగట్లే వరాలు ఆడపిల్లని కన్నది. కొండడిని కన్నప్పుడున్న సంతోషం వరాలుకీనాడు లేదు. సిమాద్రికి తన భార్య కనటం ఆనందం కంటే దుఃఖాన్నే ఎక్కువ చేసింది. అయితే యిద్దరూ తమ ఇంట్లో "మాలచ్చిం తల్లి" పుట్టిందని మాత్రం అనుకున్నారు.

మరో దిక్కులేని ఆ బాలింతరాలికి కొండడే పెద్ద దిక్కయ్యాడు. వాళ్ళ 'అమ్మకి' సాయం చెయ్యటం కోసం నెల్లాళ్ళు బడి మానేశాడు కొండడు. వాళ్ళ అమ్మ లేచి తిరుగుతున్న తరువాత- ఒక రోజు బడికెళ్ళాడు కొండడు. కాని ఆరోజు బళ్ళో పంతులుగారు వాడిని యాసలో వ్యంగ్యంగా తిట్టారు.

"నీకు సదువెందుకురా? మీ అయ్యతో పాటు నువ్వుకూడా రిచ్చా లాగటానికెళ్ళు. అమాస కొకసారి, పూర్ణానికొకసారి వస్తే నీకు సదువెవడు సెబుతాడు."

కొండడికి ఆ వ్యంగ్యంలో భావం పూర్తిగా అర్థం కాకపోయినా - కొంత

వరకు అర్థం చేసుకున్నాడు. మాష్టారు చెప్పింది కూడా మంచిదే అనిపించింది వాడికి. వాళ్ళ అయ్యతో వెళ్ళి రిక్షా లాగటం నేర్చుకుంటే తిండిలేక బాధపడక్కరలేదనుకున్నాడు కొండడు.

వాడి మనసులో అనేక రకాల ఆలోచనలు.

గంగమ్మ చెప్పినట్టు పేడ పోగెయ్యటం వాళ్ళయ్య చెప్పినట్టు కాఫీహోటల్లోకప్పులు తియ్యటం పంతులుగారు చెప్పినట్టు రిక్షా లాగటం....యివన్నీ వాడికి బాగున్నట్టే అనిపించాయి. వాళ్ళ ముగ్గుర్ని తన చిన్న మెదడులో బాగానే యిరికించుకున్నాడు. కాని వాడికి అర్థం కానిదల్లా వాళ్ళ అమ్మ. అమ్మ తనని ఎందుకు చదివించాలనుకుంటోంది? ఇలా చదివించటం ఎందుకో? వాడికి జవాబు లేని ప్రశ్న అయిపోయింది.


ఒకరోజు– బట్టలు లేవని బళ్ళోకెళ్ళనని పేచీపెట్టాడు కొండడు. ఆ రోజు సిమాద్రి వాడిని కొట్టాడు కూడాను.

"తింటానికొకటినేదుగాని— ఈడికి బట్టలు కావాలట. నానెక్కడినుంచి తెచ్చేది ఎత్తేవెల్లు నేకపోతే నేదు." సిమాద్రి గొంతు జీరబోయింది.

ఆ క్షణం సిమాద్రిని చూస్తే – అతనిలో పరిపూర్ణమయిన పుత్ర ప్రేమే వుందని – ఎవరికయినా అర్థమవుతుంది. కొండడికి అవన్నీ ఏం తెలుసు? తన తండ్రి అసహాయ స్థితిని అర్ధంచేసుకొనే స్థితిలో తానులేడు. తాను బట్టలు కావాలని అడగటం చాలా పెద్ద 'తప్పు' అని మాత్రమే అనుకున్నాడు కొండడు.

"నోరు లేనోడిని కొట్టుకుంటావెందుకు. పెంచలేనోడివి కనటం మానెయ్యాలి. కన్న తరవాత పత్తుండయినా ఆడిని పెంచుకోవాల" అంది వరాలు.

"నాను కననేదు. నువ్వే కన్నావ్" అన్నాడు సిమాద్రి.




ప్రజలు తుది వీడ్కోలు చెప్పడానికి దర్బార్‌హాల్‌లో వుంచిన స్వర్గీయ రాష్ట్రపతి శ్రీ అహమ్మద్ భౌతిక కాయంవద్ద త్రివిధ బలాధిపతులు గౌరవ ప్రపత్తులతో నిలచివున్న దృశ్యం


"ఈ ఆసికాలికేంగాని ఆడికొక లాగూ, సొక్కా కుట్టించు."

సిమాద్రి మారు మాట్లాళ్ళేదు.

ఆ రోజు కొండడు తాను అమ్మ కొడుకో, నాన్న కొడుకో తేల్చుకోవటానికి విశ్వ ప్రయత్నం చేశాడు. ఆ సమస్యకు పరిష్కారం లేకపోగా– తాను బట్టలెందుకడిగానా అని కుమిలిపోయాడు. అలా అడగటానికి ఒక కారణం ఉంది. తన బడిలో ఒక అబ్బాయి రోజుకొక కొత్తలాగూ, చొక్కా వేసుకొస్తాడు. అలాంటి బట్టలు తానెప్పుడూ చూడలేదు. వాటిని చూసినప్పుడల్లా తనకి కూడా అలాంటి బట్టలు వేసుకోవాలని వుండేది. కాని అలాంటి బట్టలు తనకెలా వస్తాయి. తింటానికిరోజూ అన్నమేలేదు. బట్టలెలా వస్తాయి.... ఈ రకపు ఆలోచనల సంఘర్షణ వాడి బుర్రలో ఒక మూల లేకపోలేదు. ఆ అబ్బాయికెలా వచ్చాయో అడుగుదామనుకున్నాడు. కాని వాడిని చూస్తేనే కొండడికి భయం. అసలా అబ్బాయిని ఎలా పలకరించాలో కూడా తనకు తెలీదు. అందుకే ధైర్యంచేసి తండ్రిని అడిగాడు. దాని పర్యవసానంగా దెబ్బలు తిన్నాడు.

కొండడు మళ్ళీ కొన్నాళ్ళు బడి మానేయవలసివచ్చింది. ఎప్పుడూ 'అయ్య' మానేయమనేవాడు–కాని యిప్పుడు 'అమ్మ' మానేయమంది. అయినా సరే ఈ సారి






తాను బడి మానాలనుకోలేదు. ఎందుకో తనకు బళ్ళోకెళ్ళాలనిపిస్తోంది.

"ఈ పది రోజులూ బడి మానేయరా కొండా" అంది వరాలు.

"నాను మానను" అన్నాడు కొండడు.

"నా బంగారు కొండ- సెల్లెల్ని ఎవరు సూత్తారు సెప్పు- మరి నువ్వే సూడాల."

"నువ్వెక్కడికెల్తావేంటి?"

"కోతలు పట్టినారుగందా. ఈ పది రోజులు కోత లకెల్తే పది రూపాయలు సేత జూడొచ్చు. నాయమ్మ, నాయమ్మ నీకు మంచి బట్టలు కుట్టిత్తాను" అంది వరాలు

అయినాసరే కొండడు బడి మాననన్నాడు. దాంతో వరాలు వాడి వీపు చిదగ్గొటి కూర్చో బెట్టింది. కదిలావంటే కాళ్ళు నరికేస్తానంది. అంతలో గంగమ్మొచ్చి "ఆడినెందుకు కొట్టుకుంటావు. ఆడే వుంటాడు లేయే" అంది.

"ఏం వుంటాడు గంగమ్మత్తా. నా పేణాలు కొరికేత్తన్నడు. అది సూత్తే పాలన్నా ఎల్లలేదు. దాన్నలా ఒదిలిపెట్టి ఎల్లినా - నా సూవంతా యాడనే వుంట దయ్యో. ఈడు సూత్తే ఎడపిల్లడు. ఈ కోతలాన్నాల్లోలూ ఎల్లకపోతే వల్లదయ్యో" కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది వరాలు.

"సిస్సీ! వూరుకోయె వరాలు! మనలా బోళ్ళందరికి ఆ దేవుడే దిక్కు, ఆడే వుంటాడులే- ఏరా మనవడా పెద్ద సదువులు సదివేత్తావేటి. కలకటేరు వయిపోదువుగాని, యిప్పుడు మాత్తరం ఏడ కెల్లబోక. సెల్లెల్ని సూసుకుని ఈడనే వుండు. సెల్లి ఏడిస్తే దానికి పాల చీసాతో పాలు పట్టించు" అంది గంగమ్మ.

కొండడు తలూపాడు. అలా ఊపక పోతే వాళ్ళమ్మ కొడుతుందన్న భయం వాడిని తలూపించింది.

కొండడు ఆ రకంగా కొన్నాళ్ళు బడి కెళ్ళలేదు. అలాగే ఎన్నో అవాంతరాలు. తల్లి దండ్రుల దిక్కులేనితనం, ఆకలి.... ఆ పసివాడిని దెబ్బలికి, మానసిక సంక్షోభానికి, భయానికి బలితీసుకున్నాయి.


కోతలయిపోయాయి. కొండడు మళ్ళీ బళ్ళో కెళుతున్నాడు. అక్కడ పంతులు గారు కూడా వాడిమీదే తన 'కసి' నంతా తీర్చుకొనేది. తలిదండ్రులు తనని ఎందుకు బళ్ళోకెళ్ళమంటున్నారు? ఎందుకుమానేయమంటున్నారు? అసలు తానెందుకు చదవాలి? చదివేంచెయ్యాలి?.... ఇలాంటి కొన్ని వేల ప్రశ్నలు ఆ పసి హృదయాన్ని సంక్షుభితం చేశాయి. వాటికి సమాధానం చెప్పుకొనే వయసు తనకు లేదు. అలాగే రోజూ బళ్ళోకెళుతున్నాడు, వస్తున్నాడు. కాని కొండడి మనసులో "సమస్యలు" అనే చెట్టుకు రోజుకొక కొత్త ప్రశ్న కొత్త చిగురు వేస్తూనేవుంది. ఆ బరువును మోయలేక వాడు దినదినం అణిగిపోతూనే వున్నాడు. ★

[చిన్నారి బాలల బంగారు భవిష్యత్తు నాశిస్తూ ఈ నా కథ వారి కంకితం.]

ఆకర్షణీయమైన బహుమతులు గెలుపొందండి. ఎంట్రీ ఫీజు లేదు

మొదటి బహుమతి : వాచీలు, కెమెరాలు, టేపు రికార్డర్, రికార్డు ప్లేయర్స్. ఏదో ఒక బహుమతి కన్సొలేషన్ బహుమతి: జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ లేక అమెరికన్ డిజైన్ చీరలు అమ్మకం దరపై. ఇది అమ్మకం అభివృద్ధి పథకం. మొదటి బహుమతులు ఇతర సొల్యూషన్లతో పోలనిదానికి ఇవ్వబడును. ఒకే విధంగావున్న సొల్యూషన్‌కు కన్సొలేషన్ బహుమతి ఇవ్వబడును. ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధమైనది.

క్లోజింగ్ తేదీ : 28-3-77



సాదా కాగితముపై పై మాదిరిగా 9 ఖాళీ గడులు తయారు చేయండి. 5 (అయిదు) నుండి 13 (పదమూడు) వరకుగల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తం 27 (ఇరువది ఏడు) వచ్చునట్లు ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడి పూరించండి. బహుమతి గెలుపొందినవారికి పోస్టేజి, ప్యాకింగ్, ఫీజు డిపాజిట్టు చేయుటకు తెలియపర్చబడును. బహుమతులు ఇంటిమేషన్ లెటరుతో జతచేయబడిన దానిలో ఇవ్వబడిన విధంగా పంచబడును.

PRABHAT SALES CORPORATION (AJ-28) Bhajanpura, Delhi-155,